

కొత్తగూడెం అర్బన్ : పాడైన పంటలను పరిశీలిస్తున్న కౌన్సిలర్, వ్యవసాయ అధికారులు



అశ్వారావుపేట :తుపాన్‌తో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు



కొత్తగూడెం అర్బన్ : బ్రిడ్జిని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

# నష్టం.. అపారం

**రైతులను ముంచిన మిగ్‌జాం తుపాను**

**కొనసాగుతున్న ఈదురుగాలుల ప్రభావం**

**పొలాల నుంచి వరద నీటిని తొలగించిన రైతులు**



టేకులపల్లి : నేలమట్టం అయిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న నాయకులు

ఖమ్మం వ్యవసాయం, డిసెంబర్ 7 : మిగ్‌జాం తుపాను జిల్లా రైతాంగాన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. చిరుజల్లులతో ప్రారంభమై ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. వరి, మిర్చి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, చెరుకు, అరటి, పొగాకు, ఆయిల్‌పాం, కూరగాయల పంటలు దెబ్బతినడంతోపాటు జీనజీవనానికి తీవ్ర ఆటంకం కలిగించింది. వరి కోతలు పూర్తయిన తర్వాత రోడ్లపై, ఇంటి పరిసరాలు, కల్లాల వద్ద ఆరబెట్టిన, నిల్వ చేసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడ్డారు. చేతికొచ్చిన వరి, చేలల్లో ఏరని పత్తి, మిర్చి వర్షానికి చెట్లపైనే తడిసి ముద్దయ్యాయి. గురువారం వర్షం లేకపోవడం.. వాతావరణం పొడిగా ఉండడంతో పొలాలు, చేలల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు తీయడం.. వరి పనలను ఆరబెట్టడం.. సస్యరక్షణ చర్యలు చేపట్టే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా, మండల, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. కలెక్టర్ వీపీ గౌతమ్ సైతం ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న, నేలవాలిన వరి పొలాలను పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా 50వేల మంది రైతులకు చెందిన 83వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు అందజేసింది. గురువారం వర్షం పూర్తిగా ఆగిపోయినప్పటికీ ఈదురుగాలుల ప్రభావం కొనసాగింది. మేఘాలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో అలుముకున్న పరిస్థితి నెలకొంది.



ములకలపలి : దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న కాంగ్రెస్, సీపీఐ నాయకులు

## నష్టాన్ని మిగిల్చిన తుపాను

**తెరిపివ్వడంతో పొలాల్లో నీరు తొలగింపు**

**తడిసిన పంట ఉత్పత్తులను ఆరబోసుకున్న రైతులు**

**జిల్లాలో 13,608 ఎకరాల్లో పంట నష్టం**

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో మిగ్‌జాం తుపాను రైతన్నలకు భారీ నష్టాన్ని మిగిల్చింది. దమ్మపేట, ములకలపల్లి, అశ్వారావుపేట మండలాల్లో ఎక్కువగా వర్షం కురవడంతో రైతుల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పత్తి, వరి, మిర్చి, మొక్కజొన్న, వేరుశనగ, ఆయిల్‌పాం, అరటి, చెరుకు, పొగాకు పంటలకు నష్టం వాటిల్లింది. రెండు రోజులపాటు కురిసిన వర్షం గురువారం తెరిపివ్వడంతో రైతులు ధాన్యాన్ని ఆరబోసుకుంటున్నారు. కల్లాల వద్ద ధాన్యాన్ని తీసుకొచ్చి ఆరబోసుకుని పొడిగా ఉన్న ధాన్యాన్ని బస్తాల్లో నింపుకుంటున్నారు. పడిపోయిన వరిని పనలను పైకి లేపి పొలాల్లోకి చేరిన నీటిని బయటకు మళ్లిస్తున్నారు. వరి కోతలతో పొలాల్లో ఉన్న వరిగడ్డి తడిసి ముద్ద కావడంతో గడ్డి ఎందుకూ పనికి రాకుండా పోయింది. దీంతో పశువులకు గడ్డి కొరత ఏర్పడింది. జిల్లావ్యాప్తంగా 7,450 మంది రైతులు 13,608 ఎకరాల్లో వివిధ రకాల పంటలు నష్టపోయినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. వరి 8,816 ఎకరాలు, వేరుశనగ 1,602, మొక్కజొన్న 585, మిరప 478, పత్తి 130 ఎకరాల్లో పంటలను నష్టపోయారు.



తడిసిన వరి గడ్డిని తీస్తున్న రైతు

# కొత్త మంత్రివర్గంలో.. ఖమ్మం జిల్లాకు అగ్రస్థానం

- **ఉప ముఖ్యమంత్రిగా మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క**
- **మంత్రులుగా తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
- **జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలకు మంత్రులుగా అవకాశం రావడంతో కాంగ్రెస్ వర్గాల్లో హర్షం**

ఖమ్మం, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కొత్తగా కొలువుదీరిన రాష్ట్ర మంత్రివర్గంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అగ్రస్థానం లభించింది. ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగా.. ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, మధిర శాసనసభ్యుడు మల్లు భట్టి విక్రమార్కను ఉప ముఖ్యమంత్రి పదవి వరించింది. అలాగే, ఖమ్మం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున గెలుపొందిన తుమ్మల నాగేశ్వరరావుకు మంత్రివర్గంలో స్థానం లభించింది. గతంలో ఆయన వేర్వేరు ప్రభుత్వాల్లో ఆర్‌అండ్‌బీ, మైనర్ ఇరిగేషన్, మేజర్ ఇరిగేషన్, ఎక్సైజ్ శాఖల మంత్రిగా పనిచేసిన విషయం విదితమే. అయితే, ఖమ్మం నియోజకవర్గానికి వరుసగా రెండోసారి మంత్రి పదవి లభించినట్లయింది. గడిచిన ఎన్నికల్లో ఇదే ఖమ్మం స్థానం నుంచి గెలిచిన పువ్వాడ అజయ్‌కుమార్‌కు మంత్రి పదవి రాగా.. ఈ ఎన్నికల్లో గెలిచిన తుమ్మలకు కూడా మంత్రి పదవి వచ్చింది. ఇక పాలేరు నియోజకవర్గం నుంచి గెలుపొందిన పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కూడా మంత్రివర్గంలో స్థానం లభించింది. అయితే, పాలేరు నియోజకవర్గంలో గెలుపొందిన అనేకమంది గతంలో మంత్రులుగా వ్యవహరించారు. సంభాని చంద్రశేఖర్, రాంరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఈ నియోజకవర్గం నుంచి గెలిచి మంత్రి పదవులు చేపట్టగా.. ఇప్పుడు కూడా అదే ఆనవాయితీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కొనసాగించింది.

**ఉప ముఖ్యమంత్రిగా 'భట్టి'..**

ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మల్లు భట్టి విక్రమార్క 2004 నుంచి ఇప్పటివరకు మధిర నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు అప్రతిహతంగా విజయం సాధిస్తున్నారు. 2009లో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో ప్రభుత్వ చీఫ్ విప్‌గా పనిచేశారు. గత శాసనసభలో ఆయన కాంగ్రెస్ శాసనసభాపక్ష నాయకుడిగా వ్యవహరించారు. ఇప్పుడు ఆయన ఉప ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక తుమ్మల నాగేశ్వరరావుకు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి మంత్రి పదవులు దక్కాయి. గతంలో ఎన్నడూలేని విధంగా ఖమ్మం జిల్లా నుంచి గెలుపొందిన ఐదుగురు శాసనసభ్యుల్లో ముగ్గురికి మంత్రి పదవులు లభించడం విశేషమని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మినహా మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు తొలిసారిగా మంత్రులుగా బాధ్యతలు చేపట్టనున్నారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి 2014లో వైసీపీ నుంచి ఖమ్మం ఎంపీగా ఎన్నికైన విషయం విదితమే. జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలకు మంత్రులుగా అవకాశం రావడంతో కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. మంత్రుల ప్రమాణ స్వీకారాన్ని స్వయంగా చూసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హైదరాబాద్ వెళ్లారు. రెండు మూడు రోజుల్లో నూతన మంత్రులు ఖమ్మం జిల్లాకు తొలిసారిగా వచ్చే అవకాశం ఉండడంతో వారికి స్వాగతం పలికేందుకు కాంగ్రెస్ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయి. ఖమ్మం జిల్లాకు గతంలో టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల పాలనలో పలువురికి మంత్రి పదవులు దక్కిన విషయం విదితమే. గతంలో తుమ్మల నాగేశ్వరరావు నీటిపారుదలశాఖ మంత్రిగా, అంతకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వంలో శీలం సిద్ధారెడ్డి చిన్న నీటిపారుదల శాఖ మంత్రిగా వ్యవహరించిన విషయం తెలిసిందే. తుమ్మల నాగేశ్వరరావు స్వగ్రామం భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లి. పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వగ్రామం కల్లూరు మండలం నారాయణపురం. భట్టి విక్రమార్క స్వగ్రామం వైరా మండలం స్నానాల లక్ష్మీపురం.

## ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటా..

**ఓటువేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు: మాజీ ఎమ్మెల్యే సండ్ర**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి, డిసెంబర్ 7: ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. నియోజకవర్గ కేంద్రంగా ఉండి ఇక్కడి ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉండి సేవలందిస్తానని అఆన్నరు. పట్టణంలోని 4వ వార్డు కౌన్సిలర్ మట్టా ప్రసాద్ ఇంటి ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో తనకు ఓటువేసిన ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని అన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా 91,805 మంది ఓటర్లు తనకు ఓటు వేశారని, వారిపక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిలిచిపోయిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ప్రస్తుత ప్రభుత్వం మంజూరు చేసి లబ్ధిదారులకు అందించేలా కృషిచేస్తానన్నారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలకూ మంత్రి పదవులు రావడం సంతోషకరమని అన్నారు. దీంతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో లేకపోయినా ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తుందని అన్నారు. అలాగే, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడవద్దని సూచించారు. బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు కూసంపూడి మహేశ్, కొత్తూరు ఉమామహేశ్వరరావు, వనమా వాసు, యాగంటి శ్రీనివాసరావు, పగుట్ల వెంకటేశ్వరరావు, లక్కినేని అలేఖ్య, కనగాల వెంకట్రావు, మాధురి మధు, పవన్, తుమ్మూరు సరస్వతి, దామోదరరెడ్డి, బోబోలు లక్ష్మణరావు, వినుకొండ వెంకటేశ్వరరావు, సురేశ్, సురేందర్ రెడ్డి, ఒగ్గు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.